మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్ రావు

పెద్దపల్లిని ముట్టుకుంటే ఉద్యమం తప్పదు

- అభివృద్ధిని ఆకాంక్షించే చిన్న జిల్లాలను ఏర్పాటు చేశాం
- ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్ రావు

పెద్దపల్లి, జనవరి 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతూ పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న జిల్లాలను ఏర్పాటు చేశారని, అందులో భాగంగానే పెద్దపల్లి జిల్లాగా ఆవిర్భవించిందని ఎమ్మెల్సీ భాను ప్రసాదరావు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామ నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించగా, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం చాలా వరకు కొత్త జిల్లాలను తొలగించే ఆలోచన చేస్తున్నట్టు ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాను కూడా తీసివేస్తామన్నట్టు వినిపిస్తున్నదని, అదేగాని జరిగితే ఎంతటి ఉద్యమానికైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కొత్త జిల్లాగా ఏర్పడ్డ పెద్దపల్లి రాష్ట్రంలో జిల్లాల అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. తొలగింపు జరిగితే జిల్లా వ్యాప్తంగా ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు దిగుతామన్నారు. ప్రభుత్వం అవసరమైతే చుట్టుపక్కల ఉన్న మరికొన్ని ప్రాంతాలను పెద్దపల్లి జిల్లాలో విలీనం చేసైనా సరే పెద్దపల్లిని జిల్లాను అలాగే ఉంచాలన్నారు. జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని, కేసీఆర్ వల్లే గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి అవుతాడు అనుకున్నాం.. కానీ, అలా జరగలేదన్నారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి అయ్యే అన్ని అర్హతలూ శ్రీధర్‌బాబుకు ఉన్నాయన్నారు. శ్రీధర్‌బాబు ముఖ్యమంత్రి అయితే జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ఎగ్జిబిట్స్

ఎంపికైన విద్యార్థులతో గైడ్ టీచర్ జగదీశ్వర్‌రెడ్డి

- డీఈవో డీ మాధవి

పెద్దపల్లి కమాన్, జనవరి 28 : జిల్లా విద్యార్థులు, ఉపాధ్యాయుడు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు రెండు విభాగాల్లో ఎంపికైనట్లు డీఈవో డీ మాధవి ఆదివారం తెలిపారు. ఐదు రోజుల పాటు విజయవాడ మురళి కన్వెన్షన్‌లో కొనసాగనున్న ప్రతిష్టాత్మక ఎస్ఐఎస్ఎఫ్-2023 కు రాగినేడు జడ్పీ స్కూల్ విద్యార్థులు ఆర్. కీర్తన (9వ తరగతి), బి. సాత్విక (8వ తరగతి) గైడ్ టీచర్ కె. జగదీశ్వర్‌రెడ్డి నేతృత్వంలో రూపొందించిన 'పోర్టబుల్ వీల్ చైర్ ర్యాంప్' ఎగ్జిబిట్ సీనియర్ విభాగంలో రాష్ట్రం నుంచి ఎంపికైనట్లు ఆమె వెల్లడించారు. బోధనోపకరణాల టీచర్ కేటగిరీలో ఈ ఏడాది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పూసాల జడ్పీస్కూల్ భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు పీ. సురేందర్ ప్రదర్శనలు ఆకట్టుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు, టీచర్‌ను డీఈవో మాధవి, జిల్లా సైన్స్ అధికారి బీ రవినందన్‌రావు, ప్రధానోపాధ్యాయులు సీహెచ్. ఆగయ్య, డీ. శ్రీనివాస్ ఉపాధ్యాయులు అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

తెలుగులో ఉచిత ఖుర్ఆన్ కొరకు
ఫోన్ చేయండి
1800 572 3000
సమస్యలన్నిటికీ పరిష్కారం దైవసందేశం ద్వారానే సాధ్యం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

30న బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

కోల్‌సిటీ, జనవరి 28: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కన్వీనర్ పీ వినోద్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న మానకొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే ఈ ఎంపిక పోటీలకు పెద్దపల్లి జిల్లా నుంచి ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో హాజరు కావాలని, ఈ పోటీలలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

పెద్దపల్లి బీజేపీలో రచ్చ రచ్చ

పెద్దపల్లి టౌన్, జనవరి 28: పెద్దపల్లి జిల్లా బీజేపీలో మరోసారి వర్గపోరు రచ్చకెక్కింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గాల మధ్య విబేధాలు భగ్గుమన్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడి సన్మాన కార్యక్రమ వేదికగా ఇరు వర్గాలు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత నెలకొన్నది. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చందుపట్ల సునీల్‌రెడ్డికి ఆదివారం పట్టణంలోని ఓ కల్యాణమండపంలో ఆత్మీయ సన్మానాన్ని ఏర్పాటు చేశారు. దుగ్యాల ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తమకు ఆహ్వానం అందలేదని గుజ్జుల వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. దీంతో ప్రదీప్ రావు వర్గీయులు వారితో తోపు లాటకు దిగారు. పరస్పరం దుర్భాషలాడుకున్నారు. ఇరువర్గాల నేతలు ఒకరిపైకి మరోకరూ దూసుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొన్నది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వడ్డేపల్లి రాజేందర్‌ను గుజ్జుల వర్గానికి చెందిన వెల్లంపల్లి శ్రీనివాస్‌రావును దూషించారు. ఈ పరిణామాలపై సునీల్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, పార్లమెంట్ ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో వర్గపోరు రచ్చకెక్కడంతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని నాయకులు చెప్పారు.

జిల్లాను అన్నింటా అగ్రగామిగా నిలుపుదాం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు
- కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, జనవరి 28: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి పెద్దపల్లి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుదామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, అదనపు కలెక్టర్లు జే అరుణ శ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన రెండు రోజుల్లోనే ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అమలు చేశామన్నారు. మిగిలిన వాటిని వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. పెద్దపల్లిలో టాస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఐటీ రంగంపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. యాసంగిలో ఎస్సారెస్పీ ద్వారా చివరి ఆయకట్టు సాగునీరందించాలని సూచించారు. జిల్లాలో సమ్మక్క జాతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతికంగా అనుకూలంగా ఉన్నచోటనే ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మార్చి ఆఖరుకు ఉపాధిహామీ పనులు పూర్తిచేయాలని, డీఎంఎఫ్టీ నిధుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్దేశించారు. ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్, జిల్లా అధికారుల కోసం రీక్రియేషన్ క్లబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్‌డీవో శ్రీధర్, డీఈవో మాధవి, డీఏవో ఆదిరెడ్డి, వైద్య, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.ప్రమోద్ కుమార్, మంథని ఆర్డీవో ఆఫీసు ఏవో తూము రవీందర్, ప్రభుత్వ దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ రమాకాంత్, డీపీవో చంద్రమౌళి పాల్గొన్నారు.

కుర్మపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పెద్దపల్లి రూరల్, జనవరి 28: పెద్దపల్లి మండలంలోని కుర్మపల్లిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. కాపుపల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మామిడిపల్లి బాపయ్య ,తాండ్ర సదానందం, నాయకులు సందనవేని రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఎలిగేడు, జనవరి 28: అభివృద్ధిలో సుల్తాన్‌పూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు.ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద రావులతో కలిసి సుల్తాన్‌పూర్‌లో పర్యటించారు. రైతువేదిక, గ్రామ పంచాయతీ భవనాలు, పంచాయతీ దుకాణాల సముదాయాలు, గ్రంథాయం, సేంద్రియ ఎరువుల కేంద్రం, వైకుంఠధామాన్ని ప్రారంభించారు. అనంతరం స్కూల్ కిచెన్ గార్డెన్‌ను సందర్శించారు. ఇతర పాఠశాలలు సైతం సుల్తాన్ పూర్ స్కూల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే విజయరమణారావు అభివృద్ధిలో పట్టుదల ఉన్న వ్యక్తి ఆయన పట్టుపడితే వదలడని పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్ నుంచి శివపల్లి వరకున్న 4 కిలోమీటర్ల దారిని బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులకోసం పంచాయతీరాజ్ మంత్రితో మాట్లాడి మంజూరుకు కృషిచేస్తానన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సర్పంచ్ తదితరులు సన్మానించారు. ఇక్కడ స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, డీఏవో ఆదిరెడ్డి, జిల్లా ఉపాధికల్పనాధికారి వై తిరుపతిరావు, సర్పంచ్ అర్కనపెల్లి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ ఆకుల హరీశ్‌గౌడ్, జడ్పీటీసీ మండిగ రేణుక-రాజనర్సయ్య, ఎంపీపీ తానిపర్తి స్రవంతి-మోహన్‌రావు, సర్పంచులు బూర్ల సింధూజ, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు, గొల్లె కావేరి-భూమేశ్, దుగ్యాల శ్వేత-సంతోష్‌రావు, సింగిరెడ్డి ఎల్లవ్వ-రాజేశ్వరరెడ్డి, తహసీల్దార్ జే స్వర్ణ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్లతో మత్స్యకారులకు అన్యాయం

- సర్కారు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- తెలంగాణ ఫిషరీస్ సొసైటీ చైర్మన్ పిట్టల రవీందర్

పెద్దపల్లి టౌన్, జనవరి 28: రిజర్వాయర్లలో సోలార్ ఫ్లోటింగ్ సెంటర్ల ఏర్పాటుతో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ ఆందోళన వ్యక్తం చేశారు. సర్కారు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్ కో) కార్యకాలపాలపై హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జలాశాయాల్లో నీటిపైన తేలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. తెలంగాణలోని వివిధ జలాశయాలకు చెందిన మత్స్యకార ప్రతినిధులు, సొసైటీ బాధ్యులతో కలిసి ఎన్టీపీసీ రిజర్వాయర్‌ను సందర్శించి ఫ్లోటింట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించామని తెలిపారు. చేపల వేటకు వెళ్లేవారికి తీవ్ర అసౌకర్యం కలుగుతున్నట్లు గుర్తించామని చెప్పారు. రేవంత్‌రెడ్డి సర్కారు మత్స్యకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఇక్కడ పిల్లి చంద్రశేఖర్, మాల కనకయ్య, వేల్పల సరోజన. మల్లన్న సాగర్ ప్రతినిధులు దుద్దెడ గణేశ్, అట్ల అనిల్, తోకల రాజేందర్ పాల్గొన్నారు,



జ్యోతినగర్ : రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఫిషరీస్ సొసైటీ బృందం

ఎన్టీపీసీ రిజర్వాయర్‌ను సందర్శించిన ఫిషరీస్ సొసైటీ

జ్యోతినగర్, జనవరి 28: రామగుండంలోని ఎన్టీపీసీ జలాశయంలో ఇప్పటికే నెలకొల్పిన ఫ్లోటింగ్ సోలార్ యూనిట్లను పరిశీలించేందుకు తెలంగాణ ఫిషరీస్ సొసైటీ ప్రతినిధుల బృందం ఆదివారం ఎన్టీపీసీ రిజర్వాయర్‌ను సందర్శించింది. ఫెడరేషన్ మాజీ చైర్మన్, సొసైటీ వ్యవస్థాపకులు పిట్టల రవీందర్ నాయకత్వంలోని బృందం జలాశయంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు వల్ల మత్స్యకారులపై చూపుతున్న ప్రభావాన్ని స్వయంగా పరిశీలించారు.సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన కేంద్రం దాదాపు సగానికి పైగా జలాశయం విస్తీర్ణంను ఆక్రమించినట్లు ఎన్టీపీసీ అధికారులు వివరించారు. గతంలో ఈ జలాశయంలో చేపల వేటను కొనసాగించిన మత్స్యకారులను సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు తర్వాత చేపలు పట్టుకోవడానికి అనుమతించడం లేదని అధికారులు వివరించారు. ఎన్టీపీసీ జలాశయంలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కేంద్రంను ఏర్పాటు చేయడం వల్ల తమ ఉపాధిని కోల్పోయినట్లు సమీప గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఫిషరీస్ సొసైటీ ప్రతినిధులను కలిసి మొరపెట్టుకున్నారు. ఫ్లోటింగ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల కోసం సౌర పలకలను ఏర్పాటు చేయగా మిగిలిన విస్తీర్ణంలో తమకు చేపలు పట్టుకునే అవకాశాలు అధికారికంగా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పిట్టల రవీందర్‌ను కోరారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మాల కనకయ్య, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పిల్లి చంద్రవేఖర్, జిల్లా మహిళా కన్వీనర్ వేల్పుల సరోజన, మల్లన్న సాగర్ రిజర్వాయర్ ప్రతినిధులు దబ్బెడ గణేశ్, మేడ కనకయ్య, లోయర్ మానేరు డ్యాం రిజర్వాయర్ ప్రతినిధి అట్ల అనిల్, ఎల్లంపల్లి ప్రతినిధి తోకల రాజేందర్ తదితరులున్నారు.

భూమిపూజ

కొబ్బరికాయ కొడుతున్న రఘువీర్ సింగ్

జూలపల్లి, జనవరి 28: పెద్దాపూర్‌లో గంగపుత్ర సంఘం సామాజిక భవనం వద్ద చేతి పంపు ఏర్పాటు పనులకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆదివారం భూమి పూజ చేశారు. బీఆర్ఎస్ సర్కారు తాగునీటి సమస్య తీర్చడానికి రూ. 50 వేల ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ఇక్కడ మాజీ సర్పంచ్ పెద్దపెల్లి సత్యసాగర్, నాయకులు తొగరు శ్రీనివాస్, కంకణాల జ్యోతిబసు, బొజ్జ శ్రీనివాస్, పెద్దపల్లి రాజేందర్, ఆనంద్, పూరెల్లి గంగయ్య, కంకణాల వెంకటేశ్, గడ్డమీద నరేశ్, ఉయ్యాల వెంకటేశ్, పెసరు స్వామి, బుర్ర శంకర్, పల్లె సురేశ్, ఉయ్యాల పర్శరాములు, సాగర్, మహేశ్ ఉన్నారు.

హాస్టల్‌కు రూ.2 కోట్లు ఇవ్వాలి

పెద్దపల్లి, జనవరి28: పెద్దపల్లిలో యాదవ విద్యార్థి హాస్టల్ భవన నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా బాధ్యులు మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు. ఆదివారం పెద్దపల్లికి వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. కలెక్టరేట్ సమీపంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 4. 5 కోట్ల అంచనాతో నిర్మిస్తున్న ఈ భవనానికి నిధులివ్వాలని మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇక్కడ అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేకే శేఖర్ యాదవ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తోట్ల తిరుపతి యాదవ్, జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేని రాజేందర్, ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి, గొర్రెపిల్లగొంగడితో సన్మానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెరశ్రీనివాస్, సింగిల్ విండోచైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధికారుల సంఘం ఎన్నికలు

రామగిరి, జనవరి 28: సింగరేణి ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధికారుల సంఘం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక సీఎన్‌సీఓఏ క్లబ్‌లోని పోలింగ్ కేంద్రంలో సింగరేణి బ్రాంచి కమిటీకి, ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల కమిటీలకు నిర్వహించిన ఎన్నికలలో ఏరియాలో పని చేస్తున్న అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏరియాలో మొత్తం 221 మంది అదికారులు ఉండగా 198 మంది అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. బ్రాంచి కమిటీలో మొత్తం 8 పదవులు ఉండగా 39 మంది అదే విధంగా ఏరియా కమిటీలో 8 పదవులు ఉండగా 17 మంది పోటీ పడ్డారని అన్నారు. దీనిలో ఏరియా కమిటీలోని కోశాధికారి పదవికి ఎన్నిక ఏకగ్రీవమైందని, కౌంటింగ్ నిర్వహించిన తర్వాత ముఖ్య ఎన్నికల అధికారి ఫలితాలు వెల్లడిస్తారని తెలిపారు.

ఆర్థిక సాయం

సుల్తానాబాద్ రూరల్, జనవరి 28 : మండలంలోని సుద్దాలకు చెందిన తంగళ్ల చంద్రయ్య అనే హమాలీ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పీఏసీఎస్ చైర్మన్ గడ్డం మహిపాల్‌రెడ్డి, రేగడి మద్దికుంట ఎంపీటీసీ రాజమణి ఆదివారం పరామర్శించారు. అనంతరం రూ. 5వేలు అందజేశారు. వెంట రాజయ్య, వెంకటేశ్, లక్ష్మణ్ ఉన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘనస్వాగతం

పాలకుర్తి, జనవరి28: ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌కు పాలకుర్తి, అంతర్గాం పర్యటనకు రాగా రెండు మండలాల కాంగ్రెస్ నాయకులు, కన్నాల స్టేజీ, టోల్‌ప్లాజా, బసంత్‌నగర్ బస్టాండ్ ఘనస్వాగతం పలికారు. మంత్రిగా ఈప్రాంతానికి మొదటిసారి వచ్చిన శ్రీధర్‌బాబకు కాంగ్రెస్ నాయకులు నాగలి, గొర్రెపిల్లగొంగడితో సన్మానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెరశ్రీనివాస్, సింగిల్ విండోచైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అలవెన్సుపై ఇన్‌కం టాక్స్ యాజమాన్యమే చెల్లించాలి

గోదావరిఖని, జనవరి 28: సింగరేణి కార్మికుల అలవెన్సులపై ఇన్‌కం టాక్స్ యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎనర్జీ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి కోరినట్లు ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా రామగుండం పరిసర ప్రాంతంలో సింగరేణి అనుబంధ సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు ఈ విషయంపై సానుకూలంగా ఉన్నారని, అనుబంధ సంస్థపై సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. దీని ద్వారా రామగుండం, మంథని ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన వారమవుతామని సింగరేణి అనుబంధ సంస్థలు నెలకొల్పి సింగరేణికి అవసరమైన ముడి సరుకులు మనమే తయారు చేయడం వల్ల రవాణా ఖర్చు తగ్గి కోట్ల రూపాయలు ఆదా అవుతుందని, వీటికి సంస్థ సీఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

చికిత్స పొందుతూ గని కార్మికుడు మృతి

గోదావరిఖని, జనవరి 28: జీడీకే 2ఏ గనిలో ఈ నెల 22న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సమ్మిరెడ్డి అనే సర్దార్ అనే కార్మికుడు ఆదివారం హైదారాబాద్‌లోని కామినేని దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమ్మిరెడ్డికి వైద్య చికిత్సను మెరుగు పరుచాలని సింగరేణి సీఎండీ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌లు వైద్య చికిత్స కోసం పత్యేక శ్రద్ధ తీసుకున్నపట్టికి కార్మికుడు చికిత్సపొందుతూ కార్మికుడు మృతి చెందాడు. మృతిపట్ల గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

'చెకుముకి'లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఎంఎన్‌వో మహేశ్

కాల్వశ్రీరాంపూర్, జనవరి28: జనవిజ్ఞాన వేదిక కాల్వశ్రీరాంపూర్‌లో ఆదివారం నిర్వహించిన చెకుముకి పోటీల్లో తారుపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంబాడి మోహిత్, దోబిల అక్షిత్ ప్రథమ స్థానం సాధించారు. వెన్నంపల్లి హైస్కూల్ కు చెందిన కే రాంచరణ్, ఎస్ రాంచరణ్, కే ప్రశాంత్ ద్వితీయ, పెగడపల్లి కి చెందిన భరత్, రష్మిక, అజయ్ కుమార్ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానం సాధించిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని మండల నోడల్ అధికారి సిరిమల్ల మహేశ్ , హెచ్ఎం సునీత తెలిపారు. కాగా, ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. హెచ్ఎంలు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ రావు వీరిని అభినందించారు.

మల్లన్న క్షేత్రం.. భక్త జన సంద్రం

ఓదెల మల్లన్న ఆలయం ఆదివారం భక్త జన సంద్రమైంది. సమ్మక్క, సారలమ్మ జాతర సమీపిస్తుండడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. పెద్దపల్లితో పాటు ఇతర జిల్లాల్లోని వివిధ దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామి సన్నిధిలో ముగ్గుల పట్టీలను వేశారు. అన్నం వండి నైవేద్యంగా పెట్టారు. ఇంటిల్లిపాది స్వామివారిని దర్శించుకున్నారు. పిల్లాపాప, గొడ్డూ గోదను సల్లంగా చూడాలని వేడుకున్నారు.

ఓదెల, జనవరి 28:

అ'పూర్వ' సమ్మేళనం

ధర్మారం జడ్పీ స్కూల్ ఆవరణలో ఆదివారం 2007-08 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో అభ్యసించిన సమయంలోని తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. తమకు బోధించిన గురువులను సన్మానించి